క్లుప్తంగా

ప్రజలందరికీ ధన్యవాదాలు



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికీ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) బుధవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 రోజులుగా తన ప్రచారంలో వెన్నంటి ఉన్న నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగిందని, తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు భారీ సంఖ్యలో తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. మహిళలందరూ సంక్షేమ పథకాలకే పట్టం కట్టారనే సంకేతాలు వస్తున్నాయని, మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని ఎమ్మెల్యే కొడాలి నాని స్పష్టం చేశారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



గుడివాడ టౌన్: వర్షాకాలం రాగానే వరదలు రావడం, వందలాది కుటుంబాలు వరద బారిన పడటం వలన పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవిస్తున్న పరిస్థితుల నుంచి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని ఏఎన్నార్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. కళాశాల ప్రాంగణంలో ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కోనసీమ ప్రజలు సర్ ఆర్థర్ కాటన్‌ను ఇప్పటికీ దైవంలా కొలుస్తారంటే అందుకు కారణం ఎప్పుడూ వరదకు కొట్టుకుపోయే ప్రాంతాలను దవళేశ్వరం ఆనకట్ట కట్టి వరదకు కట్టడి చేయడంతో పాటు సాగు, తాగునీరు అందించిన అపర భగీరథుడిగా ఆ ప్రాంత ప్రజలు కాటన్‌ను కొనియాడతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, బీఏస్ఏస్ పద్మజ పాల్గొన్నారు.

మహర్షి భగీరథ జయంతి



గుడివాడ టౌన్: మహర్షి భగీరథ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. గుడివాడ నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ్‌పురంలోని బీసీ సంఘం కార్యాలయంలో మహర్షి భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగీరథ సగర సామాజిక వర్గానికి మూలపురుషుడు కఠోర తపస్సు చేసి దివినుంచి భువికి గంగాజలాన్ని తీసుకువచ్చారన్నారు. భగీరథ కఠోర దీక్షను చరిత్ర చెపుతుందన్నారు. అసాధ్యమైన పనులు సాధ్యం చేసి చూపిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రావులకొల్లు మల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు ఆదివిష్ణు, వై.గోవర్ధనరావు, ఆర్.సుబ్రహ్మణ్యం, ఎన్.గణేష్‌బాబు, జి.శ్రీనివాసరావు, నాగరాజు, ఎస్‌కే సయ్యద్ పాల్గొన్నారు.

18న నాగాయలంకలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం తెలిపారు. నాగాయలంక గ్రామంలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ఈ శిబిరం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల విక్రయం

విజయవాడరూరల్: రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, జనుము 10 కేజీల బ్యాగ్ 440 రూపాయలకు, పిల్లి పెసర 8 కేజీల బ్యాగ్ 670 రూపాయలుగా ధర నిర్ణయించారన్నారు. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తామని చెప్పారు. విజయవాడ రూరల్ మండలానికి 215 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా వరి పండించే భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేసి కలయదున్నడం వలన భూమిలో సేంద్రియ పదార్థం తయారవుతుందన్నారు. పిమ్మట వరి పంట పంటసాగు చేయడం వలన పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని తెలిపారు.

గుడివాడలో రికార్డుస్థాయి పోలింగ్ శాతం

- నియోజకవర్గంలో 82.51 శాతం నమోదు
- గత ఎన్నికల కంటే ఈసారి పెరిగిన ఓటింగ్ శాతం



బొమ్ములూరులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో బారులు తీరిన మహిళలు (ఫైల్)

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. మహిళా ఓటర్లలో చైతన్యం ఎక్కువగా కనిపించింది. 2019 ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం ఎక్కువ నమోదైంది. గుడివాడ అర్బన్ మండలంతో పాటు, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో ప్రశాంతంగానే పోలింగ్ జరిగింది. నందివాడ మండలంలో రెండు కేంద్రాలు, గుడివాడ పట్టణంలో రెండు కేంద్రాల్లో రాత్రి 10 గంటలకు వరకు పోలింగ్ జరిగింది. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలోనే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రికార్డ్ స్థాయిలో పోలింగ్

గుడివాడ నియోజకవర్గంలో ఈసారి రికార్డుస్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. 2004 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 2019 ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా ఓటర్లు భారీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2004లో 69.61 శాతం నమోదు కాగా, 2009లో 81.89 శాతం, 2014లో 80.29 శాతం, 2019లో 80.60 శాతం నమోదు కాగా 2024 మే 13వ తేదీన జరిగిన పోలింగ్ ప్రక్రియంలో 82.51 శాతం పోలింగ్ నమోదైంది. ఓటు పట్ల ప్రజలకు పెరుగుతున్న అవగాహన, బాధ్యతకు ఈ పోలింగ్ శాతమే నిదర్శనం.

గెలుపుపై ధీమా

గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా నియోజకవర్గంలో ఓటింగ్ శాతం భారీగా పెరగడంతో ప్రధాన పార్టీ అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తోంది. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత మూడు దశాబ్దాలుగా గుడివాడ నియోజకవర్గంలో జరగని చాలా అభివృద్ధి పనులు కేవలం ఈ ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చేసి చూపించారు. పేదల సొంతింటి కలను టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలో రూపంలో ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును వినియోగించుకున్న తరుణంలో మరోసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని గెలుపు ఖాయం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా తామే గెలుస్తామని టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారు.

గుడివాడ నియోజకవర్గంలో..	
మొత్తం పోలింగ్ బూత్‌లు	230
మొత్తం ఓటర్లు	2,04,271
పురుషులు	97,710
మహిళలు	1,06,550
థర్డ్ జెండర్స్	11
ఓటు హక్కు వినియోగించుకున్నవారిలో..	
మొత్తం ఓటర్లు	1,68,537
పురుషులు	81,119
మహిళలు	87,408
థర్డ్ జెండర్స్	10
నియోజకవర్గంలో పోలింగ్ శాతం	: 82.51

18 నుంచి మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి వారు

ఎలకుర్రు(పామర్రు): ఎలకురు గ్రామంలో శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 18 తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న ధ్వజారోహణం , చిన్నాపురం వాస్తవ్యులు జన్ను నారాయణరావు సమర్పించు సిద్దు ఆదంబి సంవాదం ఉంటుందని పేర్కొన్నారు. 19న వేద పఠనం, సహస్రనామార్చన, హరికథా కాలక్షేపం, రాత్రి తొమ్మిది గంటలకు వేదాంతం రాధేశ్యామ్ బృందం వారిచే భక్త ప్రహ్లాద నాటకం ఉంటుందని తెలిపారు. ఈ నెల 20న హరికథా కాలక్షేపం, రాత్రి ఏడు గంటలకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిచే విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లోని వ్యక్తులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన వేదపఠనం, రాత్రి ఏడు గంటలకు జగజ్జ్యోతి, రాత్రి 9 గంటలకు భ్రమరాంబ చెన్న మల్లేశ్వర నాట్యమండలి మాచిరాజు రాధాకృష్ణ సమర్పించు సత్య హరిశ్చంద్ర నాటకం ఉంటుందని, రాత్రి రెండు గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు హరికథా కాలక్షేపాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి వీరభద్రస్వామి వీధిపళ్లెం కార్యక్రమం అనంతరం రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 23న స్వామి త్రిశూల స్నానం, రాత్రికి ఏకాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలు, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని నాగేశ్వరరావు కోరారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలో బుధవారం రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పన్నాల పద్మనాభశాస్త్రికి చెందిన 10 ఎకరాల్లోని రెండు వరిగడ్డి వాములకు మధ్యాహ్న సమయంలో నిప్పంటుకుంది. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో కైకలూరు అగ్నిమాపకశాఖ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంతో రూ.లక్ష మేరకు నష్టం సంభవించినట్లు అంచనా వేశారు.

రేమల్లేలో చెరకుతోట దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలో అగ్ని ప్రమాదానికి గురై చెరుకు తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన యనమదల సాంబశివరావుకు చెందిన రెండున్నర ఎకరాల చెరుకుతోటలో ఆకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందటంతో రైతులు హుటాహుటిన అప్రమత్తం అయ్యారు. మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. సుమారుగా రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు రైతు సాంబశివరావు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

కౌలు వేలం వాయిదా

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములు సాగు కౌలు బహిరంగ వేలం పాట వేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహన్‌రావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ తాడిగడప గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 133లో 8.72 ఎకరాల వ్యవసాయ భూమి సాగు హక్కు 2024-2027 వరకు మూడేళ్లకు టెండర్ కం బహిరంగ వేలం బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించగా ఎవ్వరు ముందుకు రానుందున వాయిదా వేశామన్నారు.

వేసవి దుక్కులు ప్రారంభం



పామర్రులో ట్రాక్టరుతో వేసవి దుక్కులు

పామర్రు: మండలంలోని పలు ప్రాంతాల్లో వేసవి దుక్కులను రైతులు ప్రారంభించారు. రబీ పంటల తర్వాత కాలంలో మెట్ట, మాగాణి, బీడు భూముల్లో లోతు దుక్కులు దున్నుకోవాలి. వీటినే వేసవి దుక్కులు లేదా ఎండు దుక్కులు అని అంటారు. ఈ దుక్కులను 25-30 సెంటీమీటర్ల లోతు వరకూ దున్నాలి. ఇలా చేయడం వలన భూమిలోని గడ్డి పారలు చీలిపోతాయి. అధిక వర్షాల సమయంలో నేల గుల్లబారి నీరు ఇంకిపోతుంది. నేలలో నీటి నిల్వల సామర్థ్యం పెరుగుతుంది. భూమి లోపల పొరల్లోని కలుపు విత్తనాల వేర్లు బయటపడి వేసవిలోని అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. అలాగే సేంద్రియ పదార్థాల లభ్యత పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

వసతిని బట్టి పంటల సాగు

వేసవి దుక్కుల తర్వాత నీటి వసతిని బట్టి పెసర, మినుము పంటలను సాగు చేసుకోవచ్చు. లేదా పిల్లి పెసర, జనుము వంటి పైర్లను సాగు చేసుకోవచ్చు. చౌడు నేలలో పచ్చిరొట్టసాగు జీలుగ సాగు మంచిది. జనుము, పిల్లి పెసర, జీలుగ పైర్లను వేసి అవి పూత దశకు రాగానే తొలకరి వర్షాలు పడే సమయంలో భూమిలో కలియ దున్నాలి. దీని వలన భూమిలో సారం పెరిగి ఖరీఫ్, రబీలో వేసే పంటల పెరుగుదలకు దోహదపడుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

అద్దె భవనంలోని పోస్టాఫీస్‌తో అగచాట్లు



మండవల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్

మండవల్లి: మండవల్లి స్టేషన్‌రోడ్‌లో ఉన్న పోస్టాఫీస్ ఏళ్ల తరబడి అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదులతో ఉన్న భవనంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం కావడంతో పలు గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి అనేకమంది లావాదేవీలు జరుపుతుంటారు. చిన్న కార్డు ముక్క కావాలన్నా పోస్టాఫీస్‌కు వెళ్లి కొనుగోలు చేయాల్సి ఉంది. అదేవిధంగా డబ్బులు వేరే చోటికి పంపడానికి మనియార్డర్ కోసం ఇక్కడకు వచ్చి చేయాల్సి వస్తుంది. పట్టుమని 10 మంది కూడా నిలుచోవడానికి అద్దె భవనంలోని ఇరుకు గదులలో వీలు పడటం లేదు. స్థానిక సెంటర్‌లో సుమారు 20 సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీ పోస్టాఫీస్ భవన నిర్మాణానికి తాగు చెరువు గట్టు పక్కన 10 సెంట్ల స్థలం కేటాయించింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాటి నిర్మాణం చేపట్టని కారణంగా అద్దె భవనంలో ఉన్న పోస్టాఫీస్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పోస్టాఫీస్ కోసం ఇచ్చిన స్థలంలో నిర్మాణం చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటమి భయంతో టీడీపీ దాడులు

- పచ్చమూకల దాడిలో గాయపడిన నాయకులకు ఎంపీ అభ్యర్థి సింహాద్రి పరామర్శ



అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు

మోపిదేవి: మండల పరిధిలోని మోపిదేవిలంకలో సార్వత్రిక ఎన్నికల సమయంలో పచ్చమూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, ఆయన కుమార్తె తేజశ్రీ, జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు తదితరులను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మంగళవారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఓటమి భయంతో పచ్చమూకలు ఈ దాడులకు తెగబడుతున్నారన్నారు. అధికారం లేకుంటేనే ఇలా దాడులు చేస్తున్నారని, అధికారం వస్తే పేద వర్గాలను ఇంకెన్ని ఇబ్బందులకు గురిచేస్తారోనని ఆందోళన వెలిబుచ్చారు. అందరూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

‘సార్వత్రిక ఎన్నికల్లో విజయం మనదే’

- ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో మరో పర్యాయం కైకలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఖాతాలో చేరనుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా నిలిచాయన్నారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఏలూరురోడ్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్‌తో బుధవారం సమావేశమయ్యారు. ఆయా మండలాల్లో పోలింగ్ జరిగిన తీరును ఆయనకు వివరించారు. పోలింగ్ రోజున ప్రతిఒక్కరూ కష్టపడ్డారని అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ మండవల్లి మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టరు షేక్ చాన్ బాషా, నాయకులు గంగుల అశోక్, ముక్కెళ్ల పెద్దిరాజు, పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, నర్రా ప్రభు, బలే సముద్రుడు, నాగరాజు, కందుల వెంకటేశ్వరరావు, సంకు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డీఎన్నార్ పోలింగ్ సరళిని వివరిస్తున్న ముదినేపల్లి మండల నాయకులు

ఆక్వా రంగానికి పోతురాజు సేవలు చిరస్మరణీయం



ఆక్వా రైతు పోతురాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: ఆక్వా రంగానికి మంగినేని పోతురాజు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇటీవల పోతురాజు మరణించారు. ఆయన సంస్మరణ కార్యక్రమం కైకలూరు చిన్నచెరువు గట్టు సమీప నివాసం వద్ద బుధవారం జరిగింది. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున పోతురాజు సన్నిహితులు, కుటుంబ సభ్యులు, ఆక్వా వ్యాపారులు, దుకాణదారులు పెద్ద ఎత్తున విచ్చేశారు. పోతురాజు గురించి పలువురు మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్ర, అస్సాం, ఒడిశా, పశ్చిమబెంగాల్ ఇలా అనేక రాష్ట్రాలకు ఏ టూ జడ్ అనే సీడ్‌ఫాం ద్వారా వివిధ రకాల చేపల సీడ్ (చేప పిల్లలు) సరఫరా చేసేవారన్నారు. అనేక మందికి చేప పిల్లల విక్రయరంగం ద్వారా ఉపాధి కల్పించారన్నారు. పోతురాజు కుటుంబ సభ్యులను పలువురు నేతలు పరామర్శించారు.

గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలకు వేళాయె!

- లింగారెడ్డిపాలెంలో నేటి నుంచి స్వామివారి ఉత్సవాలు
- 18న స్వామివార్ల కల్యాణం



గోకర్ణేశ్వరస్వామి

కోడూరు: దివిసీమలో అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరుగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారి ఆలయం కల్యాణోత్సవాల నేపథ్యంలో శోభాయమానంగా వెలుగొందుతోంది. గురువారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలను ప్రారంభించేందుకు దేవదాయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, త్రిశూల పూజ, వాస్తు పూజ అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించనున్నట్లు చెప్పారు. 17న బిందెతీర్థం, మూలమూర్తికి పంచామృతాభిషేకాలు, గ్రామ బలిహరణ, రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 18వ తేదీ రాత్రికి జగజ్జ్యోతి ఉత్సవం, స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. 19న కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం, రాత్రికి రథోత్సవం, 20న అవబృందస్నానం, పూర్ణాహుతి, శ్రీపుష్పయాగ ఉత్సవాలతో కల్యాణోత్సవాలను ముగించనున్నట్లు వివరించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్ప ఆలయ 33వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి హోమం, శ్రీ లలితా హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి స్వామివారికి మహాభిషేకాలు చేశారు. సువాసినీలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాలకు హాజరైన సువాసినీలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మధ్యాహ్నం స్వామివారికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు. సాయంత్రం భగవతి సేవలో భాగంగా సువాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ భక్త బృందం పర్యవేక్షించింది.

ఘనంగా పిట్టల్లంక ఆర్‌సీఎం చర్చి వందేళ్ల వేడుక

- మరియమాత నూతన స్వరూపాన్ని ఆవిష్కరించిన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



మరియమాత స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ రాజారావు

పిట్టల్లంక(కోడూరు): మండల పరిధిలోని పిట్టల్లంకలో నిత్య సహాయమాత(ఆర్‌సీఎం) చర్చి వందేళ్ల వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విజయవాడ పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత పాత దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మరియమాత స్వరూపాన్ని ఆయన ఆవిష్కరించి పరలోక ప్రార్థన చేశారు. అనంతరం ఆర్‌సీఎం చర్చి ఎదురుగా జరిగిన కార్యక్రమంలో బిషప్ రాజారావు మాట్లాడుతూ మన పూర్వీకులు ఏసుక్రీస్తు పట్ల ఉంచిన విశ్వాసాన్ని ఈ తరం భక్తిశ్రద్ధలతో నడిపిస్తోందన్నారు. క్రీస్తు చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించడం ద్వారా శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు బిషప్ రాజారావు జ్ఞానస్థానం ఇచ్చారు. అనంతరం భక్తులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. తొలుత వాటర్ ట్యాంక్ నుంచి చర్చి వరకూ రహదారిపై చీరలు పరిచి, పూలు చల్లుతూ విశ్వాసులు బిషప్ రాజారావుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోడూరు విచారణ గురువు ప్రశాంత్ చౌటపల్లి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ, నాగాయలంక, లక్ష్మీపురం, ఎదురుమొండి, కూచిపూడి, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి విచారణ గురువులు విచ్చేసి క్రీస్తు సందేశాన్ని అందించారు. ఉపదేశిలు, సంఘ పెద్దలతో పాటు అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు స్వామి జాతర

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో పోతురాజు స్వామివారి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి శిలలకు భక్తులు పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. యువకులు వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం వద్ద రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, మచిలీపట్నంలో 11వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ బుధవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య విద్యాలయంలో దరఖాస్తులు స్వీకరించి పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. విద్యాలయంలో కేవలం ఎంపీసీ, బైపీసీలో విద్యను అభ్యసించు వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.